
# మాయిముంత

పెద్దింటి అశోక్ కుమార్



సాయమ్మకు నిద్రపడుతలేదు. చిన్నబిడ్డ దేవ యాది కచ్చి కడుపు చెరువయింది. కన్నీళ్లతో మెత్త సగం నానింది. 'బిడ్డ ఒకలకు చెయ్యి జాపకుంట బతుకాలని అప్పసప్పజేసినా ఉన్నఇంటికిఇత్తి. పిల్లలు అయితలేరంటే భూమండలం మొత్తం తిరిగితి. సల్లగ ఒక కానుపు జేత్తి. ఇప్పుడు నేను కనవడుతలేనా..అవ్వా రాయో అని తోలుక పోరా! మల్లా పొద్దులు నిండినయి. కానుపుకు ఎట్ల తోలుకరావాలె. నాకు చేతులు ఎట్లత్తయి' అనుకుంది.

అప్పుడే బయట బలబల చప్పుడు. చిన్నగా అరుపు.

ఆలోచనల్లోంచి తేరుకుని చెవులు రిక్కించి విన్నది సాయమ్మ. చప్పుడు పెద్దదయింది. సాయమ్మ ఉల్కిపడ్డది.

''అనుమానం లేదు. ఏ ఎద్దో పోతో ఎనుగు దుంకి అనుప చేన్లకు వచ్చినట్టుంది. చేనుపాడుగాను. ఏ గడియలపెట్టినమో గాని పలారంగావట్టె'' అనుకుంది.

ఎంటనే భర్తకు కేకేసి ' ఔ..ఉన్నవా? ఒకసారి గట్ల సూడుపో..అనుప చేను పెట్టుడేమోకాని కావలి గాయలేక సత్తున్నం. రాత్రిలేదు. పగలు లేదు.' గులిగినట్టు అన్నది సాయమ్మ.

సాయన్నకు అప్పుడే కన్నంటుకుంటంది. భార్య పిలుపునకు లేచిండు. ''దీనిపాడుగాను. ఇంత రాత్రిపూట ఏమచ్చే! బర్లు గిట్ల వచ్చెనాంటే పొట్టు పొట్టు తొక్కుతయి.'' అంటూ చేతికట్టె కోసం చూసిండు.

''ఏమాయె నువ్వు గోశి సదిరేవరకు అది సగం మడి తొక్కుతది. నడువు'' గదిరిచ్చింది సాయమ్మ.

చేతికట్టెను టార్చ్ లైటును అందుకుని తలుపు తెరిచి బయటకు వచ్చిండుసాయన్న.

పల్లె మొత్తం కన్ను మగ్గింది. పల్లెకు దూరంగా ఉన్న ఇల్లు అది. అనుపచేను మాగిన వాసన గప్పు మంది. చేను నిండా ఎన్నీల పరుచుకుంది. వాసన పసిగట్టి ఎక్కడెక్కడి పశువులో వత్తున్నయి. రోజుకొక్క పంచాది.

బయటకు అడుగుపెట్టిన సాయన్న పెరడంతా చూసిండు. మొదటి మడిలో నల్లటి ఆకారం కనిపించింది. లైటు కొట్టి చూసిండు. పాణం దస్సుమంది. అతడు బయపడ్డట్టు అది బర్రెనే!

''నీగత్తర్రాను గదనే! నువ్వు వాసన వట్టినవంటే ఇడుత్తవా!.. ఎద్దోపోతో ఐతే ఒకటే వత్తది. నువ్వు మందకు మంద ఎంటవెట్టుకత్తవు.'' అంటూ మట్టి పెల్లను అందుకుని బలంగా ఇసిరికొట్టిండు.

అది కొమ్ములకు తాకింది. అయినా బర్రెకదల్లేదు. తీగెల్ని మజ్జెడ మజ్జెడ తొక్కుతుంది.

సాయన్నకు తిక్కలేసింది. 'అరే..దీని కత జూసినవా..అడుగు జరుగుతలేదు.' అనుకుంటూ చేతిల కట్టెను ఇసిరిండు. కట్టె అంత దూరంపోలేదు. నాలుగు అడుగులేసి కట్టెను అందుకుని బర్రె మీదికి ఉరికిండు.

అప్పుడే బయటకు వచ్చింది సాయమ్మ. ఎన్నీల సాలులో బర్రెను గుర్తువట్టింది. దబదబ నాలుగు అడుగులేసి బర్రెదగ్గరికి వచ్చింది. కొట్టబోతున్న సాయన్నను ఆపింది. అప్పటికీ బర్రె కదులతనే లేదు.

ఆమెడ దూరం గోజకనవడితే ఉరికురికి తరిమే సాయమ్మ తనను ఎందుకు ఆపిందో అర్థం కాలేదు సాయన్నకు. అతడు అడిగేలోపే గొంతు తగ్గించి ''అది మన గొంగి బర్రెగదా! వంగు కొమ్ములు కనవడుతలెవ్వా...'' అన్నది.

అప్పుడు చూసిండు సాయన్న బర్రెను. వంగు కొమ్ములు. నాలె సూపులు. ఎత్తుగా ఉన్న ఊపురం. కోపం మరింత ఎక్కువయింది. 'గొంగిదో' గోషిదో.. తలకు వాసిన ఎంటికె. ఏ రేవులపోతే మనకేంది' అంటూ కట్టెతో బర్రె కొంకుల మీద కొట్టిండు. ఆ దెబ్బకు గెంటినట్టు రెండడుగులు ముందుకేసి ఆగింది బర్రె.

సాయమ్మ గుండెల కలుక్కుమంది. 'నీపాడుగాను. జరాగు. బర్రె సుడిమీదుంది. తీగలేత్తంది. కనవడుతలేదా' అన్నది.

నిండు కుండలెక్క కదులుతున్న బర్రెను చూసినంక సాయన్న చెయ్యి కిందికి దిగింది. అయినా కోపం తగ్గలేదు. 'నీగత్తర్రాను..నాయిల్లుకు చిచ్చుపెట్టినవు. చేసింది సాలదని మల్లచ్చినవా' అన్నాడు మొసదీస్తూ.

సాయమ్మకు కోపం లేదు. బాధగా ఉంది. అప్పటికే బిడ్డను తిట్టుకుంటూ ఏడుస్తుంది. బర్రెను చూసినంక ఆ ఏడుపు ఎక్కువయింది. దాని రొండ్ల మింద చేతులేసితట్టి ''రేపో మాపో అన్నట్టు తల్లడిత్తున్నవు. ఇప్పుడు నీకు దొంగ తిండి కావాలెనా.. నిండు పొద్దులు నిండినయి. సక్కగ ఇంటికిపో'' అన్నది మనిషితో అన్నట్టుగా.

సాయన్న కోపంతో ''ఇంక దాన్ని నెత్తిమీద ఎత్తుకో.. ఏ ఎల్లగొట్టు. తీగెల్ని తొక్కుతది.'' అన్నడు. అంటూ అరిచెయ్యితో ఈపు మిద రెండు సరిసిండు బర్రెను. బర్రె సాలు గుతూ అడుగులో అడుగేసి ఎనుగు దాటింది. సాయన్న అక్కడనే ఆగిండు. సాయమ్మ మాత్రం బర్రెను పానాది దాటిచ్చి వచ్చింది.

ఇద్దరూ ఇంట్లోకి నడిచిండ్రు. తలుపులు దగ్గరేస్తూ పానిది దిక్కు పారజూసిందిసాయమ్మ. మసక వెన్నెల్లో బర్రె కనిపించలేదు.

''చూసినవా.. గొడ్డు బర్రెను ఇచ్చినమని మీ అక్క తిట్టని తిట్టు తిట్టె. బిడ్డ సల్లగుండ బిడ్డెంత బుద్దిమంతురాలు. అనరాని మాటలనె. నన్ను ఉరివెట్టుకొని సావుమనె. ఇప్పుడ జూడు. బర్రె ఈతకచ్చె దెబ్బలు మాసిపోతయి గనీ మాటలు మరిచిపోతమా...'' బాధగాఅన్నది సాయమ్మ.

తల్లికుంటే బిడ్డె దొర్సానట. బిడ్డె కుంటే తల్లి బాంచె దట. దానికండ్లకు మనం కనవడు తున్నమా! ఆపదికి సంపతికి ఆదు కుంటదని ఊర్లె ఇత్తే అగ్గిలబొర్రిచ్చె

సాయన్న నోరు మెదుపలేదు. వచ్చి పక్కమిద వాలిండు. సాయమ్మకు నిద్ర ఎప్పుడో దూరమయింది. మంచంకోడుమిద కూసుంటూ ''ఇంట్ల ఎవ్వలు లేరట. పొద్దుగల్లనే తాలమేసి బండి గట్టుకుని మల్లన్న గుట్టలకు పోయిండ్రట. పిల్లయి పుట్టింటికలు తీత్తరట. అవ్వా పోదాం రాయె అని రాకపాయె.'' బాధగా అన్నది సాయమ్మ.

''తల్లికుంటే బిడ్డెదొర్సానట. బిడ్డెకుంటే తల్లి బాంచెదట. దానికండ్లకు మనం కనవడుతున్నమా! ఆపదికి సంపతికి ఆదుకుంటదని ఊర్లె ఇత్తే అగ్గిలబొర్రిచ్చె'' విరక్తిగా అన్నడు సాయన్న.

ఇద్దరూ మౌనంగా పక్కమలిచిండ్రు. సాయన్నకు కన్నంటుకుంది. సాయమ్మకు కన్ను మలుగత లేదు. బిడ్డ దేవనే గుర్తు కత్తుంది. ఆమె తిట్టిన తిట్లు బొచ్చెల మెరుత్తున్నయి.

సాయమ్మకు ముగ్గురు బిడ్డలు. దేవనే చిన్నది. ఇద్దరు బిడ్డలను వేరే ఊరిచ్చిండ్రు. దేవను ఊళ్లెనే మేనరికం ఇచ్చిండ్రు. యాడాది రెండేండ్లు గడిచినయి. దేవ ఊర్లెనే కాబట్టి తల్లి గారింటికి పొద్దున వస్తే మాపున ఎల్లి పోయేది. ఇద్దరు బిడ్డలు మాత్రం వారాలకు వారాలు ఉండేవారు.

ఉన్నదంతా అక్కలకే పెడుతుంది. వచ్చినప్పుడు వారాలకు వారాలుంటరు అని దేవ అనుమానం. ఊర్లెనే ఉంటదిగదా! ఉన్నదంతా చెల్లెకే పెడుతుందని అక్కల అనుమానం. మొగుళ్లు ఎగేసిండ్రు. అత్తలు దిగేసిండ్రు. అక్కచెల్లెండ్లు ముగ్గురూ శెకలుశెకలు వట్టుకున్నరు.

బర్రెపెయ్య దగ్గర పంచాది ముదిరింది. గొంగి పెయ్యను దేవమలుపుకుంది. మాకూ పెయ్యదుడెడ్లను కొనియ్యమన్నరు పెద్దబిడ్డలు. వాళ్లకు చెరొకటి కొనిచ్చింది సాయమ్మ. యాడాది రెండేండ్లలో అవి కట్టి ఈనినయి. దేవదిగొంగి పెయ్య మాత్రం కట్టలేదు.

గొడ్డుపెయ్యను ఇచ్చినవని దేవ లొల్లిజేసింది. ఇంకొకటి కొనిస్తే మాకూ కొనియ్యాలని పెద్దబిడ్డలు ఇంటిమీదకచ్చిండ్రు. దేవను చేసుకుంటే ఇల్లు పొలమూ తమకే ఉంటదనుకున్న దేవ అత్తగారికి సాయమ్మ తీరు నచ్చలేదు. ఇంటిమిదకచ్చి నానా యాగి చేసిండ్రు. పెద్ద బిడ్డలిద్దరినీ బదునాం జేసిండ్రు.

సాయన్నకు కడుపు నొప్పిలేచి పంటే చూసిపోయిన దిక్కులేరు. సాయమ్మకు జరమచ్చిపంటే వాకిలి నూకిన మనిషిలేదు. ఆపతి సంపతి అంటలేరుగనీ ఎవలకేం అందుతుందోనని డేగ కన్నేసి చూస్తండ్రు.

సాయమ్మకు అవన్నీ గుర్తుకత్తున్నయి. 'ఎవలనేమంటి? ఎవలదేం తింటి? ముగ్గురు బిడ్డలు ఆపతికి వాలుతరంటే పక్కలపాముల్లైరి. పుట్టెడు పండుగు చేసుకుంటది. పిలవద్దా..వట్టిగనేపోదునా' అనుకుంది.

అప్పుడే మళ్లా బలబల సప్పుడయింది. సాయన్నను లేపింది సాయమ్మ. లేపుతూ 'మల్లన్న గట్టుకు పోయినోళ్లు వచ్చిండ్రంటనా' అన్నది ఆరా తీస్తున్నట్టు.

''ఇప్పుడుయాడత్తురు. తినితాగి ఏ తెల్లారంగనో వత్తరు. ఎక్కిపోయేమ్యాకనట. అయినా దయ్యం బియ్యం తింటేంది? దక్కలోడు పాశం దింటేంది? నడి జాముర్రాత్రి గుయ్ గుయ్ తలిగినవు. పండూ'' అన్నడు యాష్టగా.

అప్పటికే బల బల సప్పుడు ఎక్కువైంది. 'ఏం పంటవు. లెవ్వు. సప్పుడైతంది.' అంటూ బయటకచ్చింది సాయమ్మ. ఆమె వెంటనే బయటకు వచ్చిండు సాయన్న. అది గొంగి బర్రెనే అని వెంటనే గుర్తు పట్టారిద్దరు.

ఈసారి బర్రె పెద్ద మడిలో కనిపించింది. చేన్లో అనుపకాయ ఎక్కడన్నా బలంగా ఉందా అంటే అది ఆమడిలోనే! సాయన్న పాణం కొట్టుకుంటుంది. కట్టెను అందుకున్నడు. పండ్లు కొరుక్కుంట ఉరికిండు. అతన్ని ఆగుమంటూ ఎంటనడిచింది. సాయన్న అందకుండా ముందుకు నడిచిండు.

అది మాగమాస శివరాత్రి సందు. సలి తగ్గినా ఇగంపెడుతంది. సాయమ్మ నెత్తి సుట్టూ కొంగును కప్పుకుంటూ 'తిక్కలోడు. పుసపుస రెండు దెబ్బలేసినా ఏత్తడు.' అనుకుంటూ దబదబ నడిచింది.

మసక ఎన్నెల్లో గొంగిబర్రె బస్సుబస్సుమసులుతుంది. అనుపపాదల్ని తొక్కుతుంది. ఆయాసంతో రొప్పుతుంది.

సాయన్న బర్రెను అదిలించిండు. బయటకు తోలాలని చూసిండు. వద్దని సాయమ్మనే ఆపింది. అది పురిటి నొప్పులు పడుతుందని గ్రహించింది. బర్రె రొండ్లను పునికి చూసింది. మక్కుల్ని నొక్కి చూసింది. మక్కులల్ల బొక్కలు దేలినయి. రెండు సార్లు బర్రె చుట్టూ తిరిగింది సాయమ్మ.

''అరే. రొండ్లు గుంజినయి. మక్కులు జారినయి. తోకలావట్టి తిను కుతంది. తీగెలు చిక్కవడ్డయి. ఈరాత్రే ఈనేతట్టుంది.'' అన్నది భయంగా సాయమ్మ.

సాయన్నకు కోపమచ్చింది. ''ఈననీ.. ఈనకపోనీ. మనకేంది? ఎల్ల గొడుదాం.'' అదిలిస్తూ అన్నడు. సాయమ్మ సాయన్నను కోపంగా చూసింది.'' అక్కడ ఎవలు లేరనే ఇక్క డికి వచ్చింది. ఎటెల్లగొడుదాం. ఈ రాత్రి ఎక్కడికి పోతది. ఎట్ల ఈనుతది. ఇది పుట్టినప్పుడు ఎంతకట్టమైంది. దీనితల్లికి గుడ్లమాయి ఎల్లితే బద్దలేసిక ట్టిన. దీనికిది తొలుసూరు కానుపే నాయె. ఎంతకట్టపు కానుపో'' అన్నది. అంటున్నప్పుడు సాయమ్మ కండ్లలో నీళ్లు. నీళ్లను తుడుచుకుంటూ ''నా ముగ్గురి బిడ్డలతోని దీనిమాయి ముంతగూడా నా యింట్లనే ఉన్నది'' అన్నది సాయమ్మ.

బర్రె బంతికడుతనే ఉంది. ఇద్దరికి వాదం మొద లయింది.

''ఏంది.. ఏంటిదికత. మాటచ్చింది సాలదా... శేను నాశినం గానా.. ఒక్కకాయ చేతుకురాదు.'' కోపంగ అన్నడు సాయన్న.

సాయమ్మ ఏదీ గమనించడంలేదు. బర్రెనే చూస్తంది. దాని స్థితినే అంచనా వేస్తంది. ఆయా సంతో అది తిరుగుతుంటే తొక్కిన అనుపకాయ కని పించడంలేదు. దాని పురిటినొప్పుల వేదననే కనిపి స్తుంది. సాయమ్మలో తల్లిపేగు కదులుతుంది. ఏదో మత్తు కమ్ముకుంది.

మత్తుతోనే ''నీకాయసల్లగుండ. పోతేపోనీ..పా డపత్రం జారుతంది సూడు. గంటలనో అరగంట లనో ఈనుతది. నువ్వు నీళ్లు కాగవెట్టుపో.'' అన్నది.

సాయన్నకు కోపమచ్చింది. అయినా తమా యించుకున్నడు. సాయమ్మను ఒప్పిస్తున్నట్టుగా ''గడ్డిగాడుపుల పోతేంది..? వడ్లువాగులవోతేంది. గాలికి వోయే కంపను గోసికి వెట్టుకున్నట్టు ఈక తేంది. దుకానమేంది. ఈ బర్రెసాలుమంచిదిగాదు. అప్పుడు దీనితోనే మన ఇంట్ల సిచ్చుపుట్టింది. దేవ దీన్ని మలుపుకుందని చంద్ర బర్రెను మలుపుకునె. నువ్వానేనా అని సిచ్చుపుట్టె. ఈరాత్రి దీనికి ఏమన్నా అయిందనుకో..మనను సంపనే సంపు తరు. మెల్లగ ఎనుగు దాటిద్దాం. పానాది ఎక్కిద్దాం. పల్లెకు మలుపుదాం.'' అన్నడు.

సాయమ్మ ఈసడింపుగా చూసింది. ''పుట్టునొ

గడ్డిగాడుపుల పోతేంది..? వడ్లువాగు లవోతేంది. గాలికి వోయే కంపను గోసికి వెట్టుకున్నట్టు ఈక తేంది. దుకానమేంది. ఈ బర్రెసాలుమంచి దిగాదు. అప్పుడు దీని తోనే మన ఇంట్ల సిచ్చు పుట్టింది. దేవ దీన్ని మలుపుకుందని చంద్ర బర్రెను మలుపుకునె. నువ్వానేనా అని సిచ్చు పుట్టె. ఈరాత్రి దీనికి ఏమన్నా అయిందనుకో.. మనను సంపనే సంపుతరు. మెల్లగ ఎనుగు దాటిద్దాం. పానాది ఎక్కిద్దాం. పల్లెకు మలుపుదాం

ప్పుల బాధ నీకేం తెలుసు. ఇయ్యపురాలు అల్లుడు తిట్టిండని, బిడ్డ అలిగిందని కానుపుకు తోలుకరాక ఊకు న్నమా? వాళ్ల మొఖం ఎవలు చూసిండ్రు. బర్రెమొ ఖంజూడు. తల్లడిల్లుంది. ఇదీ పురుడుకు తల్లిగారింటిక చ్చింది.'' అన్నది.

బర్రె ఆయాసంతో కాళ్లను రాస్తుంది. నీరసంగా కూలబడి లేస్తుంది. తలపై కెత్తి అరుస్తుంది. పోటు మిందున్న సముద్రంలా కల్లోలంగా కదులుతుంది. మంత్రించినట్టు సాయమ్మ బర్రె చుట్టే తిరుగుతంది. ఆయాసంతో కదులుతున్న బర్రె పశువులా కాక కడు పుతో ఉన్న కూతురులా కని పించింది. ఎందుకో కాని అప్పుడు ఎవరూ శతృవు లుగా అనిపించలేదు. మన సులో తల్లి ప్రేమ పొంగుక త్తుంది సాయమ్మకు.

సాయన్నకుమాత్రం అస హనంగా ఉంది. కోపంగా కూడా ఉంది. అది తొక్కు తున్న అనుపపొదలే కనిపి స్తున్నయి. ఆమెను హెచ్చరిస్తున్నట్టు ''సూడూ.. ఇది తొలుసూరి ఈత. ఏమైతదో తెలువది. రేపు మనమే చేసినమని బదునాం జేత్తరు.'' అన్నడు.

అంతేకోపంగా ''నీబుద్ధుంటే నాతో ఉండు. లేకుంటే మలుసుకపండు. అంతేగని ఒర్రకు. బర్రెను ఆగం జెయ్యకు.'' హెచ్చరించింది సాయమ్మ.

సాయన్న బస్సుమన్నడు. చేతులకట్టెనాలెకు గొట్టిండు. ''యాడనన్న అగ్గిదలుగు. ఆరునెల్లు కాసింది అగ్గిలవెట్టు. రేపు వాళ్లు వచ్చినంక కత్తివెట్టి చీరుతరు. అప్పుడు ఆయిగుంటది.''అని కోపంగా ఇంట్లకు నడిచిండు.

అతనికంటే ముందుగనే నడిచింది సాయమ్మ. పొయ్యిరాజేసి నీళ్లు పెట్టింది. కంకెడన్ని ఎల్లిగడ్డ లను దంచి ముద్దజేసింది. వరి,గోదుమ,మినుప పిండిలను కలిపి నానవెట్టింది. సందెడు ఎండు గడ్డిని తెచ్చి బర్రెముందు ఏసింది.

ఎన్నీ నడినెత్తిమిదకచ్చింది. బర్రె ఒర్రుతుంది. తినుకుతంది. తల్లడిత్తంది. నడ్డి ఇరుత్తుంది. పండు కుంటలేత్తుంది. దాని ఆయాసాన్ని సూత్తూ కూసు న్నది సాయమ్మ. 'ఆడిజన్మపాడుగాను.. ఆడిజన్మ పాడుజన్మ బిడ్డా... ఓర్సుకో.. ఇంకో గొంతసేపైతె అయిపాయె. బిడ్డపుట్టుడంటే తల్లిసచ్చిపుట్టినట్టు..' అంటుంది బర్రెతో.

బర్రెమసలుతనే ఉంది. అరగంట. గంట. రెండు గంటలయింది. తీగలు పుడుతనే ఉన్నయి. పాడ పాత్రం మాత్రం రాలుతలేదు.

సాయమ్మకు భయమయింది. సాయన్న మాటలు గుర్తుకచ్చినయి. 'అరే... ఇవారకు ఈనే దుండె. ఇంకా తండ్లాడుతనే ఉంది. పిండంగిట్ల ఎదురుతిరిగెనా ఏంది?' అనుకుంది ఈ ఆలోచన రాంగనే సాయమ్మకు సల్ల చెమటలు పుట్టినయి.

పోయి సాయన్నను లేపుదామా అనుకంది. లేపితే ఈ స్థితిలోనూ బర్రెను ఎటో తోలి చేతులు దులుపుకుంటడనుకుని మానుకుంది.

చలి ఎక్కువయింది. నెలవంక వంగింది. ఆగి ఆగి గుడ్లగూప చప్పుడు. కుక్కల అరుపులు. చీమ చిటుక్కుమన్నా వినిపించే నిశబ్దం. బర్రె మసులు తంది. తల్లడిత్తుంది. బర్రెముందు గొగ్గాల్లమిద కూసుంది సాయమ్మ. తన మూడు కాన్పులు..కాను పుకష్టమైనప్పుడు తాంబోలం సప్పుడు తడుము దెబ్బలు యాదికత్తున్నయి.

''పరమాత్మా.. ఎంతపనైపాయె..నాబిడ్డ మంచి దన్నాగాదు. కావాలని నేనే సంపిన్నని బదునాం జేత్తది. మైసవ్వతల్లి.. ఎట్లనన్న గడ్డకు పడెయ్యి బాంచెను..'' అనుకుంది.

అట్ల అనుకుందోలేదో.. ఇట్ల టప్పుమని సప్పుడు. ఉల్కిపడ్డది సాయమ్మ. తెల్లగా బుగ్గలా వచ్చిన పాడపాత్రం టప్పున పగిలింది. సాయ మ్మకు కొద్దిగా భయం తగ్గింది. దబదబ రెండు చేతులకు ఆందెం రాసుకుంది. రాసుకుంటూ ' ఈ మనిషి వచ్చుగద మంచిగుండు. తొలుసూరు కాను పాయె. ఒగలకొగలం దీము.' అనుకుంది. వెంటనే 'పాపపు మనిషి నేను ఆపదివడ్డనాడే ఇంట్ల పండక పాసువలుగ తిని మంచె మిద పన్నడు.' అను కుంది.

తల్లడిచ్చి తల్లడిచ్చి బర్రె కూలవడ్డది. తల్లడి చ్చిన తల్లికి, ఈలోకానికి రెండుకాళ్లు ముడిచి దండంపెడుతూ సంటిదుడ్డె బయటకచ్చింది. బర్రె వరిగడ్డిలో సదురుకుంది. సాయమ్మ చేతులు లేచి నయి.

''చూసినవా..తల్లడిచ్చుకుంటనే తల్లి పిల్లకొరకు దేవులాడుతంది. నిలవడి ఈనితే పిల్లకు దెబ్బ తలు గుతదని గడ్డిలపన్నది.'' అనుకుంటూ దుడ్డెను సాగదీత్తంది. ఒర్రుతున్న బర్రెను పుణుకుతంది.

పదినిమిషాల్లో దుడ్డెబయటకచ్చింది. ఇట్లా బయటకచ్చిందో లేదో అట్లా ఎనక్కి తిరిగింది బర్రె. దుడ్డెముక్కుమిదున్న ముర్రును మొదటనాకింది. తర్వాత డెక్కల్ని కొరికింది. తర్వాత చెవులు, మొఖం, పెయ్యంతా నాకింది.

''చూసినవా దీని ఆరాటం. ముక్కుమిదిముర్రు తియ్యకపోతే దుడ్డెకు దమ్ముపీల్వరాదు. డెక్కలు కొరుకకపోతే నడువరాదు. పెయ్యినాకకపోతే దుడ్డె గట్టివారదు. ఇవన్నీ దీనికి ఎవలు నేర్పిండ్రు..'' అనుకుంది. వెంటనే ''నాపిచ్చిగాని తల్లికి ఒకలు నేర్పాలెనా? బిడ్డలు వట్టిగనే పెరుగుతరా? నాబిడ్డలు మొగులు మిదినుంచి రాలిపడ్డట్టు మాట్లాడుతరు.'' అనుకుంది.

బర్రె ఆరాటంగా దుడ్డెను నాకుతనే ఉంది. ముక్కు, మూతి, కండ్లు, చెవులు, పట్టిపట్టి నాకు తుంది. నాకుతూ మట్టును కుమ్మరిత్తంది.

మట్టును చూసిన సాయమ్మ పానం దస్సుమంది. మట్టు కర్రెగా కమిలిపోయినట్టుంది.

''వామ్మో..మట్టు కమిలిపోయింది. మట్టుకమిలిపోతే మాయి పడది. మాయిపడకపోతే బర్రెబతుకది. పిండం బయటకు వచ్చుడు ఒక ఎత్తయితే మాయి పడుడు మరో ఎత్తు. ఇట్లగావట్టె'' అనుకుని ఇంట్లకు ఉరికింది. ఎల్లిగడ్డ పిండి ఉడుకు నీళ్లల కలిపి బర్రెముందుంచింది.

బర్రె తుఫాను తర్వాత సముద్రంలా ఉంది. తన లోకమంతా దుడ్డెనే అన్నట్టుగా ఉంది. ఆయాసమంత మరిచి దుడ్డెను నాకుతూపండుకుంది.

బర్రె పండుకోంగనే సాయమ్మకు మరింత బయమయింది. ఈనంగనే మాయిపడేదాక బర్రె నిలవడాలె. పండుకుంటే మాయికి బదులు గుడ్లమాయి ఎల్లుతది. గుడ్లమాయి ఎల్లితే బర్రెగుడ్డు మగ్గినట్టే.

'ఎంతకర్మకచ్చె..సల్లగ ఈనిందంటే మాయి దగ్గర పరేషానచ్చె..' అని బర్రెను తట్టిలేపింది. ఉడుకు ఉడుకు కుడిది తాగిపిచ్చింది. నాలుగు బుక్కలు కుడిది తాగిన బర్రె దుడ్డెను నాకుతనే ఉంది. నాకుతూ నాకుతూ మరింత మట్టునుపోసింది. ఆమె అనుమానాన్ని మరింత గట్టిపరుస్తూ మట్టు గబ్బు వాసన గొట్టింది.

బయపడుతూనే సంటిదుడ్డెను పొదుగు దగ్గరికి తెచ్చింది సాయమ్మ. తొలుసూరికానుపాయె. పొదుగు నిండుగా ఉన్నా మొనల్లో దారసాగలేదు. తడిచేసి సన్నుల్ని సాగదీసింది. ముర్రుపాలు తాగితెనే దుడ్డె బతుకుతది. ముర్రుపాలు ఎంతతాగితే అంత గట్టి గుంటది దుడ్డె.

సంటి దుడ్డె నోటికి సన్ను అందిచ్చింది సాయమ్మ. దుడ్డె పతుకులాడుతంది. దుడ్డెను దగ్గరికి జరిపింది. సంటిదుడ్డె ఎక్కడెక్కడో తడుముతుంది. కొద్దిసేపు మాయిని, భయాన్ని మరిచిపోయింది సాయమ్మ. దుడ్డెను తన గుండెకు అదిమిపట్టి దానినోట్లె రొమ్ముల్నిపిండింది. దుడ్డె తత్వాన్ని, సాయమ్మ ఆలోచనను అర్థం చేసుకున్నట్టు బర్రె అనుకూలంగా కాళ్లను దూరం జరిపి పంగటిచ్చి వంగి నిలవడ్డది.

'అదీ..తల్లి మనసు. దీన్ని తల్లినిజేసిన దున్నపోతు ఏ కొట్టంల గుర్రుకొడుతుందో..నామొగని లెక్క. రేపు సాది సవరిచ్చడానికి తనరక్తాన్ని పాలనుజేసి జనాన్ని బతికిచ్చుటకు తల్లి ఎన్ని ఇద్దెలు నేరుత్తది. ఎన్నినొప్పులు దీత్తది.' అనుకుంది.

బాలింత బర్రె. ఎంత పశువైనా పెయ్యి పచ్చి పుండయితది. దుడ్డెనోట్లెకు పాలు పిండుతంటే రొమ్ములు పలిగినయి. రక్తం కారుతంది. అసలే పొదుగు ఆయువుపట్టు. సాయమ్మకు తన పెద్దబిడ్డ పుట్టిన సంగతి యాదికచ్చింది. తనరొమ్ములు గూడా పట్టన పలిగి పుండ్లయినయి. ఆ బాధ ఇప్పుడు మతిలోకి వచ్చింది. కండ్లల్ల నీళ్లు తిరిగినయి. అంతరక్తాలు కారుతున్నా బర్రె మొసుల లేదు.

'నీ దుడ్డెపొడుగాను. బతికితే బతుకుతది. సత్తె సత్తది.' బోరెమోలె మొగడు వోంగ బొంత శింపులకు ఏడ్సినట్టు.' దానిపానమేపోతంది. ఇదోలెక్కనా..రక్తాలు గారుతన్నయి. ఏంపిండుడు' అనుకుని దుడ్డెను దూరం జరిపి లేచింది. కాని బర్రె దూరం జరుగలేదు. దుడ్డెకు మరింత దగ్గరగా జరిగి పొదుగును అందించింది.

పాలరుచి రక్తంరుచి తెలువని సంటిదుడ్డె ఆకలి ఒక్కటే తెలిసినట్టు తల్లి పొదుగుమిదికి ఎగబడ్డది. పెయ్యి పుండయినా, రొమ్ముపచ్చలైనా పాలురక్తం కలిసిపారుతున్నా ఆయాసాన్ని నిక్కవట్టుకుని నిలవడ్డది బర్రె. ఎక్కడ దుడ్డె తడి ఆరుతుందోనని తల తింపి మెడను సాగదీసి మిగిలిపోయిన ముర్రును నాకుతుంది.

తననుతాను మరిచి బర్రెను దుడ్డెనే చూస్తంది సాయమ్మ. ఆమె రొమ్ములు బరువెక్కినయి. సేప్రలచ్చినట్టు సలుపరింత. ఉడుకునీళ్లతో బర్రెను కడిగింది. ఎల్లిగడ్డనూనె పెయ్యంత రాసింది. బర్రె ముందు వరిగడ్డి ఏసింది. నాలుగు పచ్చటి అనుప చెట్లను పీక్కచ్చి నోటికి అందించింది. రెండుసార్లు కుడిదిపట్టింది.

దుడ్డెసొలుగుతూ సొలుగుతూ పాలకొరకు ఎగవడుతుంది. గడ్డిపోసల్ని నములుతూ నములుతూ ఆయాసాన్ని బిగవట్టుకుని బర్రెపాలు ఇత్తనే ఉంది. రెండింటిని చూస్తూ 'అందుకే అంటరేమో బిడ్డ రాయి. తల్లి లక్క అని.' అనుకంది సాయమ్మ.


గంట గడిచింది. రెండు గంటలు గడిచినయి. ముర్రుపాలు నిండా తాగి దుడ్డె మలుసుకపన్నది. దుడ్డెనుముందటేసుకుని బర్రెనాకుతుంది. పోసేమట్టుపోత్తనే ఉంది. మాయి మాత్రం రాలేదు. వత్తున్న జాడలేదు. లెక్కలేని దేవుండ్లకు మొక్కుకుంట కూసుంది సాయమ్మ.


అంతవరకూ సోపతున్న ఎన్నీల గూకింది. చీకటి నిండింది. అది బర్రె జీవితంల చీకటే అనుకుంది సాయమ్మ. నోట్లతడి ఆరిపోయింది. పైకి చూస్తే నడిజాము తిరిగినట్టు పట్టెమంచం వంగింది. నాలుగు కట్టెలు పోగేసి మంటవెట్టింది. అడుగున అనుపకాయలు మాడి పురిటివాసనలో కలిసిపోతన్నది.

మంటవెలుగులో ఇప్పటికంటే స్పష్టంగా కనవడుతంది బర్రె. దాని కండ్లల్లో ఇప్పుడు ఇంకో ఆయాసం కనవడుతంది. అది పురిటినొప్పులది కాదని తెలిసిపోతనే ఉంది. మాయి ఉండజుట్టి ఎదురు బొచ్చెల తంతే వచ్చే ఆయాసం. ఆ ఆయాసమేదో తనకే ఉన్నట్టు తల్లడిచ్చింది సాయమ్మ.

పొంటె జామయింది. బర్రె తల్లడిత్తంది. కొట్టుకుంటంది. ఇంటిమిద గుడ్లగూబ అరుత్తంది. బర్రె మిద గబ్బిలాలు తిరుగుతున్నయి. బర్రె ఒర్రుడు మొదలువెట్టింది.

సాయమ్మకు ఏడుపచ్చింది. రేపు ఎవలో ఏమో అంటరన్న భయంకంటే బర్రెను, దాని బాధను చూస్తెనే కండ్లనీళ్లుగారుతున్నయి. ఏడ్సుకుంటనే ఇంట్లకు పోయింది. గొడ్డలి అందుకున్నది. సాయ






న్నను లేపింది. గొడ్డలి చేతికిచ్చింది. బూరుగు చెక్కను కొట్టుక రమ్మన్నది.

చెక్కపేరు వినంగనే ఉల్కిపడ్డడు సాయన్న. వద్దన్నడు. బదునాం అయితమన్నడు. కోప్పడుతూ ''ఆ చెక్క మంచిదిగాదు. మాయిపడకపోతే ఇప్పుడేం సావది. తెల్లారని. తెల్లారినంక నలుగురిని పిలుద్దాం. సురుకులు పెట్టిద్దాం. బదునాం మనమిదికి రాదు. ఈ చెక్కపోసినమనుకో. పడె నాంటే మాయిపడుతది. పడలేదనుకో గంటల సచ్చిపోతది. ఎవడు వెట్టుకున్న పీకులాట చెప్పు.'' అన్నడు సాయన్న.

సాయమ్మ వినలేదు. కోపానికచ్చింది. ''నీదేం నొత్తది. నొప్పులు తీసినోనివా..పిల్లలు కన్నోనివా.. తెల్లారనట తెల్లారని. ఆ ఆయాసం కంటే సచ్చింది నయం. దాని నొప్పులు జూసినవా.. గవ్వన్నిజెప్పకు..నువ్వుతెత్తవా..నేనుతేవన్నా..'' అన్నది. అంటూ అతడు చెప్పేది వినకుండా గొడ్డలితో బయటకు నడిచింది.

అసలే నిద్రమబ్బు. ఆ మీదకోపం. సాయిలుకు తిక్కవుట్టింది. సాయమ్మ చేతులనుంచి గొడ్డలి గుంజుకుని బూతులు తిట్టుకుంట అడివికిపోయిండు. బయటబర్రె కొట్టుకుంటంది. ఇంట్ల సాయమ్మకొట్టుకుంటంది.

సాయన్న చెక్క తెచ్చేవరకు సాయమ్మ జాజును, గంజిని కలిపిపెట్టింది. దానిని చూసి మరింత బయపడ్డడు సాయన్న.

వద్దేవద్దన్నడు. బర్రెను సంపుతవా? అన్నడు బదునాంగాకుమన్నడు.

సాయమ్మ వినలేదు. ఒర్రుతున్న బర్రె ఆయాసమే కండ్లముందు కదిలింది. ఏదో మత్తులో ఉన్నటు చెక్కను దంచి జాజులకలిపి బర్రెకు పోసింది. ప్యాయ్యంగ పోసిందిగనీ పోసినంక సాయన్న మాటలే నిజమనిపించినయి. కాళ్లు చేతులు సల్లవడ్డయి. 'ఎంతపనైపాయె. మందువోయికడుపుల వడె.'అనుకుంది.

మందుకడుపుల వడంగనే ఒర్రుతున్న బర్రె కూలవడ్డది. మెడలు సాపింది. కండ్లు నిలేసింది నాలుగుకాళ్లను సాగదీసింది. కడుపు ఉబ్బింది. ఎగపోతమొదలువెట్టింది.

సాయమ్మ గుండెల రాయివడ్డది. సుట్టూచీకటి. నడుమల మంట. అప్పుడప్పుడూ కుక్కల అరుపు. చిమ్మట్లరొద. ఒంటరి ఇల్లు. సాయమ్మకు మరింత బయమయింది.

'లంజే..సూశినవా..వద్దంటే ఇన్నవా? ఉచ్చెతార్థంగ బర్రెను సంపితివి. రేపువాళ్లకు ఏం జెప్పుతవో చెప్పు..కడేబజార్లనివెట్టి..'' బూతు అందుకున్నడు సాయన్న.

తల్లి ఆయాసం సంటిదుడ్డెకు తెలువది. పొదుగుమిదికి ఎగవడ్డది. బిడ్డ ఆకలి తల్లికి తెలుసు. ఆయాసంతోనే కాళ్లు పంగటిచ్చింది. దుడ్డెను గుంజుదామని ఎనుకకుపోయింది సాయమ్మ. బుగ్గుమని చిన్నగ సప్పుడు ఇనవడ్డది. పోయినపానం వచ్చినట్టయింది. తోక కింద చెయ్యిపెట్టి తడిమింది. చేతికి సల్లగ తలిగింది.

సాయమ్మ చిన్నపిల్లనే అయింది. ఎగిరిగంతేసింది. ' ఏ..మాయి వడుతంది.మాయివడుతుంది..'అన్నది.

సాయన్న ఉలిక్కిపడ్డడు. కొర్రాయి అందుకచ్చి చూసిండు. సరిగ్గా కనిపించలేదు. ''నీయవ్వ..మాయివడుతందా..గుడ్లమాయివడుతందా..బర్రెను లేపు..లేపు..'' అన్నడు.

ఇద్దరు కలిసి బర్రెను లావట్టింద్రు. నిలవెట్టింద్రు. దుడ్డెను దూరం జరిపింద్రు.

బర్రె ఒక్కతినుకుడు తినికింది. తట్టెడు మాయి కిందరాలింది. ఊపిరిని ఉగ్గవట్టుకున్న సాయమ్మ గట్టిగా దమ్ముతీసి వదిలింది. సాయన్నకు గూడా బయం పోయింది. నవ్వుకున్నడు. మాయిని పొక్కతీసి పాతిపెట్టిండు. సాయమ్మ బర్రెను ఉడుకునీళ్లతో ఇంకోసారి కడిగి నూనె ఎల్లిగడ్డరాసి మట్టులోంచి బయటకు తెచ్చింది. ఈ ఆగంలో వాళ్లు సూడలేదుగనీ ఎనుగు దుంకిన నాలుగు కోడిగిత్తలు అనుపచేనును కలెతిరిగినయి.

అప్పటికి బలబల తెల్లారుతుంది. పిట్టలు పీసుపీసుమంటున్నయి. మొర్రుపాలుదాగి దుడ్డె గంతు లేత్తుంది. బిడ్డగంతులను చూసి బర్రె మురిసిపోతంది. పెయ్యదుడ్డెపుట్టిందని సాయమ్మ మురిసిపోతంది. బద్దిరద్ది తప్పిందని సాయన్న మురిసిపోతండు.

గుట్టతీర్థం నుంచి తాగితిని నడిజాములరాత్రి ఇంటికచ్చిన శంకరి ఇంటికిరాని బర్రెకోసం తిరుక్కుంట తిరుక్కంట అనుపచేను అంచుకచ్చినిలవడ్డడు.

''శంకరి వచ్చిండు బర్రెను కొట్టియ్యి.'' భర్తతో అన్నది సాయమ్మ.

సాయన్న బర్రెను లేపిండు. దుడ్డెను ఎత్తుకుని ముందట నడిచిండు. దుడ్డె వాసననుపట్టి నడువరాకున్నా నిలదొక్కుకుని దుడ్డె ఎంట నడుత్తంది బర్రె. ఎక్కడనో తెప్పలల్ల తేలుతున్న గద్దను పసిగట్టి వాకిట్లున్నతల్లికోడి పిల్లలను రెక్కలకింద దాసుకుంది.

సాయమ్మ తల్లికోడిని, తల్లి బర్రెను మార్చి మార్చి చూత్తంది. ఆమె కండ్లల్ల నీళ్లు నిండినయి.

సాయన్న దుడ్డెను శంకరి చేతుల వెట్టిండు. శంకరి దుడ్డెను అందుకుని పెయ్యదుడ్డెనా పోతుదుడ్డెనా అని చూసిండు. చూసి నవ్వుకుంట దారివట్టిండు. ఎవలుపిలువకుంటా. ఎవలూ అదిలించకుంటా బిడ్డ వాసనను పట్టుకుంటనే బర్రె శంకరి ఎటువోతే అటుపోతంది.

సాయమ్మగుండె కరిగింది. 'అవును. తల్లి లక్క. పిల్ల రాయి.' అనుకుంది. శంకరికి ఎదురు తిరిగింది. ''శంకరీ.. ఎప్పుడచ్చింద్రయ్యా..పొల్లకు ఎంటికలు తీసింద్రా..దేవపాణమెట్లుంది...'' అడిగింది.

శంకరి చెప్పిండు. సాయమ్మ బొడ్లె సంచి తీసింది. యాభై రూపాయల నోటు తీసింది. 'పుట్టెంటికలు తీయంగనే అమ్మమ్మ కుడుక బెల్లం చేతులవెట్టాలె. మీరు పోతున్నట్టు తెలువకనే పాయె. పొల్లకు కుడుక బెల్లం కొనిపెట్టు' అంటూ నోటు ఇచ్చింది.

మొదాలు అనుమానపడినా తర్వాత నోటును అందుకుని దుడ్డెను ఎత్తుకుని ముందుకు నడిచిండు శంకరి.

సాయన్న బర్రెతొక్కిన మడి దగ్గరికచ్చి నిలవడ్డడు. సాయమ్మ సాయన్న దగ్గరికి వచ్చి నిలవడ్డది. బర్రెతొక్కిన అనుపచేను మడి ఆడిపిల్లలున్న ఇల్లు లెక్క అంగడంగడుంది. సాయన్న మడిని చూస్తండు. సాయమ్మ బర్రెనే చూస్తంది. చూస్తూ చూస్తూ 'తొడుసుమల్లోడు. నా బిడ్డకు బిడ్డపుట్టిన్నాడు. ఆడివిల్లపుట్టిందని అలిగిపోయిండు. ఇప్పుడేమో ఆడిదుడ్డె పుడితే మురుత్తండు.' అన్నది.

''ఆడిదోమొగదో... ఒక కానుపు చేసిన. ఇంక నా..దేవ నాకడుపనేతొక్కద్దు' సాయన్న అనుకున్నడు.

''పోరికి పొద్దులు నిండినయి. తోలుకరావాలె. అత్తముండదేంపోతుంది. ఆపదివడేదాకా రుద్దుతది'' సాయమ్మ అనుకుంది.

తన బిడ్డది మాయి ముంతను తల్లి గారింట్ల పాతి తనతో ఎడబాసిన రెండిండ్లను తనే కలుపుతూ గొంగిబర్రె బిడ్డె వెంట సాగిపోతంది. ★